ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబురాలు, గాంధీ శిల్ప బజార్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా బుధవారం శ్రీకృష్ణ నృత్యాలయ గురువు జక్కా శ్రీకృష్ణ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనను ప్రదర్శించి అలరించారు.

చెరువు..కనుమరుగు!

గంగారం పెద్ద చెరువులో అక్రమంగా మట్టి డంపింగ్



గంగారం పెద్దచెరువులో అక్రమంగా మట్టి వేసిన దృశ్యం

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం పెద్దచెరువులోకి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. పీజేఆర్ ఎన్‌క్లేవ్‌కు వెళ్ళేదారి నుంచి అయ్యప్ప స్వామి దేవాలయం వెనుకాల నుంచి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో పూర్తిగా మట్టి నింపి నిర్మాణాలకు తెరలేపుతున్నారు. చెరువు సుందరీకరణ పేరుతో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టినా అక్కడక్కడ కొన్ని సమస్యల వల్ల నిలిచిపోయింది. ఇదే అదునుగా చూసుకున్న ఆక్రమణదారులు రాత్రి సమయాలలో లారీ, ట్రాక్టర్ల ద్వారా చెరువులో మట్టిని పోస్తున్నారు. ఇటీవల స్థానికులు మట్టి తరలింపుపై తహశీల్దార్, ఇరిగేషన్ శాఖల అధికారులకు ఫిర్యాదులు చేసినా వారు కేవలం సదురు వ్యక్తి తెలియకుండా చందానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి చేతులు దులిపేసుకున్నారు. ఇంకా ఈ మట్టి తరలింపును నిలువరించకుంటే పెద్ద చెరువు పూర్తిగా కనుమరుగవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా చెరువులో మట్టిని తరలిస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి, శేరిలింగంపల్లి మండల తహశిల్దార్, జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, సర్కిల్ 21 ఉపకమిషనర్‌లకు ఫిర్యాదులు చేయడం జరిగిందన్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేశాం

గంగారం పెద్ద చెరువులోని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయి. దీనిపై చందానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. అక్రమదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– నారాయణ, ఈఈ ఇరిగేషన్ శాఖ

చెరువులో మట్టిని తరలిస్తున్న వారిపై కేసు నమోదు

చందానగర్‌లోని గంగారం పెద్ద చెరువులో మట్టి తరలింపుపై ఇరిగేషన్ అధికారులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంబంధిత వారిపై కేసు నమోదు చేశాం. దర్యాప్తు చేసి వారిపై చర్యలు తీసుకుంటాం.

– పాలవెల్లి, చందానగర్ ఎస్‌హెచ్‌ఓ

పరిసరాల పరిశుభ్రతపై నిర్లక్ష్యం వద్దు



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న జోనల్ కమీషనర్ స్నేహ శబరీష్

మియాపూర్ : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని, కాలనీ, బస్తీలను పరిశుభ్రంగా ఉంచాలని శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ స్నేహ శబరీష్ పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. చందానగర్ సర్కిల్ -21 పరిధిలోని మియాపూర్‌లో ఉప కమీషనర్ వంశీకృష్ణ, వైద్యాధికారి కార్తీక్‌లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె స్వచ్ఛ ఆటోల పనితీరును పరిశీలించి సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ప్రతిరోజూ స్వచ్ఛ ఆటో రిక్షా వారు కాలనీ, బస్తీలలో ప్రతి ఇంటికి వెళ్లి చెత్తసేకరణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులున్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



జిన్నారంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని 254 హెచ్ఎండీఏ పరిధిలో పలు అక్రమ నిర్మాణాలను చేపట్టడంతో బుధవారం హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారులు కూల్చివేయించారు. ఈ స్థలాల్లో హిందువుల దేవాలయంతో పాటు చర్చి నిర్మాణాలు కూడా ఉండటంతో నిర్మాణాలను తొలగించొద్దని క్రిస్టియన్లు, హిందువులు అడ్డుకొని స్థానిక ప్రజలతో కలిసి నిరసన చేపట్టారు. దీంతో ఇరు వర్గాల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దారు. చర్చి, హిందూ దేవాలయాల నిర్మాణాలను మినహాయించి మిగతా నిర్మాణాలను అధికారులు జేసీబీలతో కూల్చివేయించారు.

జిన్నారంలో...

జిన్నారంలోని 1002 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారనే ఫిర్యాదులు రావటంతో తహసీల్దార్ రవికుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ జయశంకర్ నారాయణ నిర్మాణాలను కూల్చివేయించారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసి నిర్మాణాలు చేపడితే సహించేది లేదని తహసీల్దార్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

రాంనరేష్‌నగర్ కాలనీ సమస్యలను పరిష్కరిస్తా

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, అధికారులు, కార్పొరేటర్

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రాంనరేష్‌నగర్ కాలనీలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి, చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై బుధవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాదయాత్ర చేపట్టారు. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో పాటు కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు ఆయనతో కలిసి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతామని అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరలో పూర్తి చేస్తామన్నారు.

◆ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు స్థానిక సమస్యలను త్వరగా పరిష్కరించి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. రాంనరేష్‌నగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచారు. డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. త్వరలోనే డ్రైనేజీ నిర్మాణం, మ్యాన్‌హోల్స్ మరమ్మతులు చేపట్టాలని సూచించారు. త్వరలో రోడ్డును ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, ఏఈ రాజీవ్, డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రశాంతి, బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

చిత్రప్రదర్శన ప్రారంభం



మాదాపూర్ : మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ అర్ట్‌గ్యాలరీలో చండీఘర్ రాష్ట్రానికి చెందిన రష్మీత వేసిన చిత్రాల ప్రదర్శనను బుధవారం ప్రదర్శించారు. ఈ ప్రదర్శన ఈనెల 16వతేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆకట్టుకుంటున్న స్పెక్ట్రమ్ అర్టిస్ట్‌సర్కిల్ ...

9మంది కళాకారులు వేసిన చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఆర్ట్ లవర్ అంజుపొద్దార్ ప్రారంభించారు. ఈనెల 15వ తేదీ వరకు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



మాదారంలో వైద్య శిబిరం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని మాదారం గ్రామంలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి చెందిన వైద్యులు బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురికి ఉచితంగా వైద్య పరీక్షలను చేసి అవసరమైన మాత్రలను పంపిణీ చేశారు. సర్పంచ్ సరిత, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, వార్డుసభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోటకు వచ్చే పర్యాటకుల తిప్పలు



కోట చౌరస్తా వద్ద ట్రాఫిక్ జామ్

గోల్కొండ: ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన గోల్కొండ కోటకు వేలాదిగా పర్యాటకులు వస్తుంటారు. విదేశీ పర్యాటకులు సైతం భారీ సంఖ్యలో వస్తుంటారు. సెలవులతో పాటు వారంతపు రోజుల్లో పాఠశాలల విద్యార్థులు, ఎన్నో కుటుంబాలు కోటను సందర్శిస్తాయి. గోల్కొండకు వచ్చే పర్యాటకులు ఇక్కడ సౌకర్యాల లేమితో నిరుత్సాహంగా తిరిగి వెళ్తున్నారు. పర్యాటకుల్లో ఎక్కువ శాతం వివిధ రకాల వాహనాల్లో వస్తుంటారు. వారికి సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వారాంతపు సెలవు రోజుల్లో..

- వేలాది కార్లు, టూరిజం బస్సులు, ద్విచక్ర వాహనాల రద్దీ సెలవు రోజుల్లో అధికంగా ఉంటుంది. కేంద్ర పురాతత్వ సర్వేక్షణ శాఖ పర్యాటకులకు ఇప్పటి వరకు పార్కింగ్ కోసం స్థలాన్ని కేటాయించలేదనే విమర్శలున్నాయి. ప్రైవేటు పార్కింగ్ భారీ సంఖ్యలో వచ్చే వాహనాలకు సరిపోవడం లేదు.
- పర్యాటకులు తమ వాహనాలను లంగర్‌హౌజ్ నుంచి రాందేవ్‌గూడ, రాందేవ్‌గూడ చౌరస్తా నుంచి గోల్కొండకు వచ్చే రోడ్డు పక్కన పార్కు చేయాల్సి పరిస్థితి ఏర్పడుతోంది. దాదాపు 2–3 కిలోమీటర్లు నడుచుకుంటూ కోటకు వెళ్తున్నారు. కోట ప్రధాన ద్వారానికి ఆనుకుని ఉన్న కోట ప్రహరీ పాడవునా బల్దియా ఫ్రీ పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఇది ఏమాత్రం సరిపోవడం లేదు.
- భారీసంఖ్యలో పర్యాటకులు వచ్చిన సమయంలో కోట అధికారులు అదనపు బుకింగ్ కౌంటర్లను ఏర్పాటు చేయడం లేదని పలువురు వాపోతున్నారు. దీంతో బుకింగ్ కౌంటర్ల వద్ద పర్యాటకులు బారులు తీరుతున్నారు.

క్యాంటీన్ లేక అవస్థలు..

కోటకు వచ్చే పర్యాటకులు కోట మొత్తం కలియ తిరిగేందుకు కనీసం 3–4 గంటల సమయం పడుతుంది. ఇక్కడి క్యాంటిన్‌లో కేవలం ఐస్‌క్రీమ్‌లు మాత్రమే లభిస్తున్నాయి. దీంతో పర్యాటకులు భోజనం లేదా టిఫిన్లు లేకపోవడంతో పెదవివిరుస్తున్నారు.

భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాజశేఖర్

బాలానగర్: బాలానగర్‌లోని ఐడీపీఎల్ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని ట్రక్, ప్రైవేట్ బస్సుల డ్రైవర్లు స్వచ్ఛందంగా డ్రైవర్స్ బంద్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొని ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల ఎంపీలను పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేసి అడ్డదారిలో డ్రైవర్లను బతికి ఉండగానే చనిపోయినట్లుగా ఉండే చట్టం తెచ్చారని పేర్కొన్నారు.

◆ ఈ చట్టం ప్రకారం ప్రమాదాలు జరిగినప్పుడు డ్రైవర్లకు 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.7లక్షల నష్టపరిహారం ఇచ్చేలా చట్టం తెచ్చి డ్రైవర్లను పనిచేయకుండా చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. శిక్షలతోనే ప్రమాదాలు తగ్గుతాయనేది గుడ్డి ఆలోచన అని విమర్శించారు. ముందు కేంద్ర ప్రభుత్వం రోడ్లపై గుంతలు లేకుండా చూడాలన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉమేష్‌రెడ్డి, విష్ణు, మోసిన్, శేఖర్, నరేష్, సత్యం, భాస్కర్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతలు



అవంతినగర్ ఈస్ట్‌కాలనీలో అక్షింతలను పంపిణీ చేస్తున్న అన్నెం కోటిరెడ్డి

మోతీనగర్: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలను పంపిణీ చేయటం తమ అదృష్టంగా భావిస్తున్నామని అవంతినగర్ ఈస్ట్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు లయన్ అన్నెం కోటిరెడ్డి అన్నారు. బుధవారం కాలనీలో ఇంటింటికీ వెళ్లి అక్షింతలను అందజేశారు. ప్రతి ఒక్కరూ ఈనెల 22న జరిగే స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం టీవీలో వీక్షించి పునీతులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు ఏ. వీరబాబు, జనరల్ సెక్రటరీ టి.దేవేందర్‌రావు, వీణకుమారి, సత్యానాదం, ఏలేందర్ రెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ సుశీల్‌కుమార్, శివకుమార్, బి.శ్రీనివాస్‌రెడ్డి, సుబ్బారావు, హరీష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామానికి చెందిన మారుతి కులకర్కి(51) కొంతకాలంగా మానసికస్థితి సరిగా లేకపోవడంతో ప్రతిరోజు రాత్రి పడుకునే ముందు నిద్రమాత్రలు వేసుకొని పడుకునేవాడు. ఈ క్రమంలో మారుతి మంగళవారం ఉదయం నిద్రమాత్రలు వేసుకొని అపారకస్థితికి చేరుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడు కుమారుడు శ్రవణ్ కులకర్ణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దర్జాగా ప్రభుత్వ భూముల కబ్జా

- అమీన్‌పూర్ పట్టణంలో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- సహకరిస్తున్న రెవెన్యూ, మున్సిపల్ అధికారులు
- అన్యాక్రాంతమవుతున్న విలువైన భూములు
- అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



తొలగించిన ప్రహరీని పునర్ నిర్మిస్తున్న దృశ్యం

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలో ప్రభుత్వ అసైన్డ్ చెరువుల భూములు కబ్జాకు గురవుతున్నాయి. ఈ కబ్జాలకు అధికారుల నుంచి పూర్తి మద్దతు లభిస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు ఈ కబ్జాలపై అధికారులకు ఫిర్యాదు చేసినా నేటికీ స్పందన కరువైంది. ఎన్నికలకు ముందు బీరంగూడలోని దేవాలయం చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూములను కుల సంఘాలకు పంచిపెట్టారు. కానీ.. స్థానిక నాయకులు 100 గజాలను ప్లాటుగా చేసి అమ్ముతున్నారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని తెలిసినా అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదు. అంతేకాకుండా మున్సిపాలిటీ నుంచి ఆ ఇళ్లకు ఇంటి నంబర్లు సైతం వస్తున్నాయి.

విలువైన భూములు అన్యాక్రాంతం..

మున్సిపాలిటీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో కోట్ల రూపాయలు విలువ చేసే అత్యంత విలువైన అమీన్‌పూర్ పట్టణ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. వాల నారాయణరావు వెంచర్‌లో నవ్య ఎదురుగా ఇటీవల ప్రహరీ కూడా నిర్మించారు. దీంతో సమాచారం తెలుసుకున్న అధికారులు తొలగించారు. అయినప్పటికీ మళ్లీ ప్రహరీని పునర్ నిర్మిస్తున్నారు.

ప్లంబర్‌కు ఈనాం..

అమీన్‌పూర్ పట్టణంలో ఉన్న ప్రభుత్వ భూమిలో వాల నారాయణరావు వెంచర్ ఏర్పాటు చేసి ఎటువంటి అనుమతులు లేకున్నా యథేచ్ఛగా ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్నారు. అంతేకాకుండా ఎలాంటి డాక్యుమెంట్లు, అనుమతులు లేకపోయినా నిర్మాణాలు చేపడతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదు. ఓ ప్రజాప్రతినిధి ఇంట్లో ప్లంబర్‌గా పనిచేసిన వ్యక్తి ఇదే వెంచర్‌లో అక్రమంగా ఇల్లు నిర్మిస్తున్నాడు. అదేవిధంగా బచ్‌పన్ స్కూల్‌కు ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిలో నిర్మాణాలకు మున్సిపల్ అధికారులను అనుమతులు ఇవ్వడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆలయ భూమిని కాపాడాలి



అమీన్‌పూర్‌లో ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అవసరం ఉంది. అయితే తమ ప్రయత్నం దేవాలయ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరగకుండా చూడాలని కోరుతున్నాం. అందుకోసం ఇటీవల కౌన్సిలర్లతో కలిసి రెవెన్యూ అధికారులకు వినతిపత్రం కూడా సమర్పించాం. అయినా నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. శివాలయం సమీపంలో సర్వే నెంబర్ 993లో అక్రమ నిర్మాణాలను జరుగుతున్నాయి.

– లింగంగౌడ్, బీరంగూడ గ్రామం

పోలీసుల సహకారం తీసుకుంటాం



అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైతే పోలీసుల సహకారం తీసుకొని నిర్మాణాలను కూల్చివేయిస్తాం. ప్రభుత్వ భూములను కబ్జాలు చేసేవారిపై కేసులు నమోదులు చేయించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూములను కాపాడేందుకు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తాం.

– రఘునాథ్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, అమీన్‌పూర్

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో...టమాట 25, పచ్చిమిర్చి 50–60, బెండ 55, కాకర 60, దొండ 50, దోస 50, ఆలు 25, చామ 60, కీర 25, బీర 60, వంకాయ 50, గోకర 60, బీన్స్ 50, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 25, క్యారెట్ 55, చిక్కుడు 50, ఉల్లి 40 (1 కేజీ), ములక్కాయలు (1) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 250, వెల్లుల్లి 250.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

◆ వైశాలీ నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైశాలీనగర్, ఉషోదయ ఎన్‌క్లేవ్, మంజీరా పైప్‌లైన్ రోడ్డు, ఏపిఎన్‌జీఓ కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

◆ ఆదిత్య ఇంపిరియల్ హైట్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆదిత్య ఇంపిరియల్ హైట్స్, వినాయకనగర్, ప్రకాష్‌నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రాజేందర్ తెలిపారు.

అంబులెన్స్‌లో ప్రసవం



గచ్చిబౌలి: ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో ఓ మహిళ ప్రసవించి పండంటి ఆడశివువుకు జన్మనిచ్చింది. చందానగర్ మంజీరా పైపులైన్ రోడ్డులో నివాసం ఉండె గర్భిణీ ఉషా(23)కు పురిటి నొప్పులు రావడంతో కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. కేసు క్రిటికల్‌గా ఉందని, నిలోఫర్‌కు వెళ్లాలని అక్కడి డాక్టర్లు సూచించారు. దీంతో 108 అంబులెన్స్‌లో బయలుదెరారు. మాసబ్‌ట్యాంక్ సమీపంలో అంబులెన్స్‌లోనే ఆడశిశువుకు జన్మనిచ్చింది. ఈఎంటీ మారుతి ప్రసాద్, పైలట్ ప్రణయ్ పురుడు పోశారు. అనంతరం తల్లి, శిశువులను నీలోఫర్ ఆస్పత్రిలో చేర్పించారు.

ఆచార్య గోనానాయక్‌కు సత్కారం



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు విభాగంలో అధ్యాపకులుగా పనిచేస్తున్న ఆచార్య గోనానాయక్‌కు బుధవారం హెచ్‌సీయూలో సత్కరించారు. హెచ్‌సీయూలోని తెలుగు విభాగంలో ఆయనను తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఏపీలో తెలుగు బాషా సేవ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకోవడం పట్ల పలువురు ఆచార్యులు ఆయనను అభినందించారు. శాలువాతో సత్కరించి ఆయన పొందిన పురస్కారాన్ని అందించారు. హెచ్‌సీయూ ప్రొఫెసర్లు పిల్లలమర్రిరాములు, పవన్‌కుమార్, డి విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలోని శ్రీ సీతా రామాంజనేయ ఆలయంలో బుధవారం మండల పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ మండల పూజకు ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు హరిష్ రావు, శ్రీనివాస్ యాదవ్, జ్ఞానేశ్వర్, మల్లేష్, రాజు, ఆర్టీసీ కాలనీ అసోసియేషన్ సభ్యులు సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రొఫెసర్ షమీమ్ జైరాజ్‌పురికి ఘన నివాళి

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ షమీమ్ జైరాజ్‌పురికి నివాళులు అర్పించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఆయన సంతాప సమావేశాన్ని నిర్వహించారు. 81 ఏళ్ళ వయస్సు కలిగిన ఆయన బుధవారం న్యూఢిల్లీలో మృతి చెందారు. ఉర్దూ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎం షమీమ్ జైరాజ్‌పురికి సంతాప సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉర్దూ విశ్వవిద్యాలయం కోసం చేసిన సేవలను కొనియాడారు. రిజిస్ట్రార్ ఇష్తియాక్ అహ్మద్, ప్రొఫెసర్లు షగుఫ్తా షాహీన్, సిద్దిఖీ మహ్మద మహమూద్ పాల్గొన్నారు.

బోరుమోటార్ల ఏర్పాటు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని మాదారం గ్రామంలో సీఎస్ఆర్ నిధులతో రైతులకు ఉపయోగపడేవిధంగా సర్పంచ్ సరిత, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం మూడు బోరుమోటార్లను వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడేలా బోరుమోటర్లు వేయించటం సంతోషంగా ఉందన్నారు. వార్డుసభ్యులు భగవాన్‌సింగ్, భాస్కర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య



శ్రీదేవి మృతదేహం

మియాపూర్ : ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ దశరథ్ తెలిపిన వివరాల ప్రకారం... కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం మిర్జాపూర్‌కు చెందిన ముత్యం, శ్రీదేవి(37) దంపతులకు కుమారుడు సాయితేజ, కుమార్తె సావిత్రీలున్నారు. వీరు మియాపూర్‌లోని న్యూ కాలనీలో నివాసముంటున్నారు. ముత్యం గత మూడు సంవత్సరాల క్రిందట దుబాయ్‌కు వెళ్లి అక్కడే ఉండిపోయాడు. శ్రీదేవి స్థానికంగా ఇళ్లల్లో, కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తోంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పిల్లలను బడికి పంపించి శ్రీదేవి ఇంటికి గడియ వేసుకుని ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని పాల్పడింది. మధ్యాహ్నం సమయంలో కూతురు సావిత్రి ఇంటికి వచ్చి కిటికిలోంచి చూడగా ఫ్యాన్‌కు శ్రీదేవి ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. స్థానికుల సహాయంతో కిందకు దించగా అప్పటికే మృతిచెందింది. పోలీసు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కూలీ మృతి.. కేసు నమోదు

హఫీజ్‌పేట్ : కూలీ మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రఘు తెలిపిన మేరకు.. బిహార్ రాష్ట్రానికి చెందిన మోఫిజ్ (50) పాపిరెడ్డి కాలనీలో నివాసముంటూ చందానగర్ లేబర్ అడ్డాలో కూలీ పనుల కోసం వెళ్తుండేవాడన్నారు. ఈ నెల 9న పనులు ముగించుకొని లేబర్ అడ్డాలోని నీటి ట్యాంక్ వద్ద స్నానం చేస్తున్నాడు. వెంటనే ఒక్కసారి కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే శ్రేయస్ హాస్పిటల్ చికిత్స కోసం తరలించారు. వైద్యులు మెరుగైన వైద్యం కోసం సిటిజన్ హాస్పిటల్‌కు తరలించాలని కోరారు. దీంతో సిటిజన్ హాస్పిటల్‌లోని వైద్యులు మోఫిజ్ మృతి చెందాడని ధృవీకరించారు. మోఫిజ్ కుటుంబ సభ్యులు అనుమానస్పంధగా మృతి చెందాడని ఆరోపిస్తూ చందానగర్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.